క్లుప్తంగా

ఘనంగా అన్నపూర్ణ దినోత్సవం



వెంకన్నను సత్కరిస్తున్న రోటరీ మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్ రావు

బోట్‌క్లబ్: రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో అన్నపూర్ణ దినోత్సవం కార్యక్రమాన్ని క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ గోపీనాథ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్ రావు ప్రారంభించారు. స్థానిక విముక్తి కాలనీ, పరివర్తన చిల్డ్రన్ హోమ్, రోటరీ చేయూత భవన్ ఆశ్రయం పొందుతున్న విద్యార్థులకు భోజనాలను స్వయంగా రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ సభ్యులు వడ్డించారు. అన్నపూర్ణ దినోత్సవం సందర్భంగా మూడు ప్రాంతాలలో రుచికరమైన విందు భోజనాన్ని ఏర్పాటు చేసిన డాల్ఫిన్ హోటల్ అధినేత బదిరెడ్డి వెంకన్నను రోటరీ క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఎస్‌వీఎస్ రావు చేతుల మీదుగా సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ సానా ప్రవీణ్ కోశాధికారి ఉదయ చక్రవర్తి, రోటరీ వృద్ధాశ్రమ కమిటీ చైర్మన్ డాక్టర్ సతీష్, బ్లడ్ బ్యాంక్ కమిటీ కార్యదర్శి మాచారెడ్డి పాల్గొన్నారు.

ఏఆర్టీ, సరోగసి సెంటర్లలో తనిఖీలు



ఏఆర్టీ సెంటర్‌లో తనిఖీ చేస్తున్న డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్

కాకినాడ క్రైం: స్థానిక ఏఆర్టీ, సరోగసి సెంటర్లలో డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ ఆధ్వర్యంలో బృందం మంగళవారం తనిఖీలు నిర్వహించింది. వివిధ సెంటర్లలో పత్రాలు, పరికరాలు పరిశీలించింది. ఏఆర్టీ యాక్ట్ 2021 ప్రకారం సెంటర్ల యాజమాన్యాలు తప్పకుండా నిబంధనలు పాటించాలని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేట కొత్త చేపల మార్కెట్ షెడ్డులో కల్యాణ శ్రీనివాస్ అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానికుల ద్వారా శనివారం తెలుసుకున్న శ్రీనివాస్ అన్నయ్య రఘు, అతని కుటుంబ సభ్యులు పోలీసులకు విషయాన్ని తెలియజేశారు. సంఘటన ప్రాంతానికి పోలీసులు చేరుకుని విచారణ చేపట్టారు. కల్యాణ శ్రీనివాస్ స్థానిక ఈశ్వర్‌నగర్‌కు చెందిన వాడుగా గుర్తించారు. మృతుడి ఎక్కువగా మద్యం సేవిస్తాడని తెలిసింది. అయితే సర్పవరం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడ అధికారుల ఫోన్ నెంబర్లు

మున్సిపల్ అధికారులు	
కమిషనర్	9100945696
అదనపు కమిషనర్	9849907096
డిప్యూటీ కమిషనర్	9949921555
ఏసీపీ	9989743049
ఎంహెచ్‌వో	9949432320
ఎస్ఈ	9959988639
మేనేజర్	7093519888
టీపీఆర్వో	9701385284
అకౌంట్ ఆఫీసర్	9849907084
సిటీ మిషన్ మేనేజర్	7901610084
పంచాయతీ అధికారుల ఫోన్ నెంబర్లు	
డివిజనల్ పంచాయతీ అధికారి	9849903188
ఫుడ్ ఇన్‌స్పెక్టర్	9494297564
ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ	9100121109
జిల్లా వ్యవసాయశాఖాధికారి	8331056483
దేవదాయశాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్	9290145126
గృహ నిర్మాణశాఖ డీఈ	7093930577
పశుసంవర్ధకశాఖ జేడీ	9989932835
డీసీసీబీ జీయం	8341208227
జిల్లా సహకారశాఖ అధికారి	9100109168
జీజీహెచ్‌లో ముఖ్యమైన ఫోన్ నంబర్లు	
సూపరింటెండెంట్	98499 03870, 0884 2302001
సీఎస్ ఆర్ఎంవో	98499 03871
డీసీఎస్ ఆర్ఎంవో	98499 03871
ఆర్ఎంవో	0884 2302003
డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్	0884 2302002
అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)	98499 03873, 0884 2302004
పోలీస్ అవుట్‌పోస్ట్	83329 57924
అత్యవసర విభాగం	0884 2302021
బ్లడ్ బ్యాంక్	0884 2302009
మెడికల్ రికార్డ్స్ సెక్షన్ (ఎంఆర్‌డీ)	0884 2302018

కరప మండల అధికారుల ఫోన్‌నంబర్లు

ఎంపీడీఓ	9346790319
తహసీల్దార్	9849903908
ఈఓ పీఆర్ ఆర్డీ	9849352293
మండల ఇంజనీరింగ్ అధికారి	8886865417
మండల వ్యవసాయాధికారి	8331056589
ఎంఈఓ-1	8008293994
ఎంఈఓ-2	8919940656
హౌసింగ్ ఏఈఈ	7093930450
ఉపాధిపథకం ఏపీఓ	7093998259
వెలుగు ఏపీఎం	9959989273
ఎలక్ట్రికల్ ఏఈ	9440812638

జీతం చాలక.. భద్రత లేక..

- నిరుద్యోగుల కోసం ప్రతి నెలా జాబ్‌మేళా
- ఎంపికవుతున్న ఎక్కువ మంది అభ్యర్థులు
- జీతం చాలక జాబ్‌లో చేరని వైనం

బాలాజీచెరువు: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టినా పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పన కార్యాలయం, సీడాప్ సంయుక్తంగా జాబ్‌మేళాలు నిర్వహిస్తోంది. ప్రతి నెలా 3వ తేదీ నుంచి 4వ తేదీ వరకూ జాబ్‌మేళాలు నిర్వహిస్తోంది. ఇంత వరకూ బాగానే ఉన్నా ఎంపికైన అభ్యర్థులు మాత్రం కొలువుల్లో చేరడంలేదు. అత్యధికులు జాబ్‌ల్లో చేరకపోతుండడంతో ఈ విషయం అధికారులను ఆలోచనలో పడేస్తోంది.



జిల్లా ఉపాధి కార్యాలయం

చేరేది 50శాతం లోపే..

గత ఏప్రిల్, మే, జూన్ నెలల్లో 11 జాబ్ మేళాలు నిర్వహించగా 1468 మంది హాజరయ్యారు. వీరిలో 356 మంది ఎంపికగా కేవలం 100 లోపే ఉద్యోగాల్లో చేరారు. దీన్ని బట్టి ఏవిధంగా ఉందో అర్థమవుతోంది. పదో తరగతి నుంచి డిగ్రీ వరకూ చదివిన వారు ఎక్కువగా జాబ్‌మేళాకు హాజరవుతుండగా ఎక్కువ మంది నుంచి జీతం తక్కువ అనే సమాధానం వస్తున్నట్టు తెలుస్తోంది. ఇతర జిల్లాలకు వెళ్లితే అక్కడ ఉండేందుకు నెలవారీ ఖర్చులకు జీతం సరిపోదనే భావనతో ఉద్యోగాల్లో చేరడంలేదని చెబుతున్నారు. పరిశ్రమల్లో మారుతున్న అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు లేక కొందరు పేరున్న పరిశ్రమలు కావాలంటూ మరి కొందరూ చేరడం లేదంటూ తెలుస్తోంది. గుర్తింపు కలిగిన వాటిల్లో పని చేస్తే జీతం, భద్రత, ఉంటుందనే యోచన ఎక్కువ మందిలో కనిపిస్తోంది. అంటే జీతాలు సరిపోకపోవడం, కంపెనీలు సక్రమంగా ఇవ్వకపోవడం వంటి సమస్యల కారణంగా చాలా మంది ఉద్యోగాలను మానేస్తున్నారు. కాగా మంచి సంస్థల్లో ఉద్యోగాలు రావాలంటే తగిన విద్యార్హతతో పాటు ఏదైనా పరిశ్రమలో పని చేసిన అనుభవం ముఖ్యమని, వాటి సాధనపై శ్రద్ధ పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు.

నెల	జాబ్‌మేళా..	హాజరైన వారు	ఎంపికైన వారు	చేరిన వారు
ఏప్రిల్	03	526	150	45
మే	04	442	102	32
జూన్	04	500	104	29

లక్ష్యం నెరవేరే దిశగా అడుగులు



నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా మినీ, మెగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నాం. పెద్ద సంఖ్యలో అభ్యర్థులు హాజరవుతున్నా ఎంపికై నియామకపత్రం తీసుకున్నవారిలో కొందరు ఉద్యోగాల్లో చేరడం లేదు. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. లక్ష్యం నెరవేరేలా ప్రణాళికలు చేస్తున్నాం.

– ఇ.వసంతలక్ష్మి, జిల్లా ఉపాధికల్పనాధికారి

ఓఆర్ఎస్‌తో అతిసార నివారణ

కాకినాడ రూరల్: చక్కెర, ఉప్పు కలిపిన నీటిని తాగించడం వలన అతిసారం నుంచి కాపాడుకోవచ్చని కాకినాడ ఐడీఏ కార్యదర్శి డాక్టరు అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. అతిసారం నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ కార్యాలయం వద్ద కాకినాడ ఐడీఏ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించి, వృద్ధులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టరు అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ విరోచనాలు, వాంతులు కారణంగా శరీరంలోని నీరు కోల్పోయిన వ్యక్తికి ఇచ్చే ఓఆర్ఎస్ ద్రావణంలో సోడియం, పొటాషియంతో పాటు చక్కెర లవణాలు ఉండి నీరసపడకుండా కాపాడుతాయన్నారు. ఎక్కువ ద్రవ పదార్థాలు తీసుకుంటే మనిషి ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, రెడ్నం రాజా, డాక్టరు వేదుల శిరీష, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వేతనం పెంచాలి

కరప: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం రూ.15 వేలు చెల్లించాలని జిల్లా పంచాయతీ వర్కర్స్ యూనియన్, ఐఎఫ్టీయూ అనుబంధ సంస్థ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు రాగుల రాఘవులు డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలలో చేసినా, గ్రామ పంచాయతీలో చేసినా పారిశుధ్య పని ఒక్కటేనని, అయితే చెల్లించే వేతనాల్లో వ్యత్యాసం చూపడం దారుణమన్నారు. ఒకే రకమైన పనికి ఒకే విధంగా వేతనాలు ఇవ్వకుండా శ్రమ దోపిడీ చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నడకుదురులో మంగళవారం పారిశుధ్య కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం రూ.6 వేలు, పంచాయతీ నుంచి రూ.3 వేలు వెరసి రూ.9 వేలు చెల్లిస్తున్నారని, ఈవేతనం చాలక కార్మికులు కుటుంబ పోషణకు అధిక వడ్డీకి అప్పులు చేయాల్సి వస్తోందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఐఎఫ్టీయూ నాయకుడు గుబ్బల ఆదినారాయణ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ గ్రామ పంచాయతీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. తర్వాత ఎంపీడీఓ కార్యాలయానికెళ్లి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. పారిశుధ్య కార్మికులు ఎస్.రాజు, బి.రామాంజనేయులు, ఎ.దేవి, డి.ఏరియా, ఎం.ధనమ్మ, ఎం.వరినమ్మ, ఎ.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న రాఘవులు, ఆదినారాయణ

సారా రహిత ప్రాంతంగా గుడారిగుంట

కాకినాడ క్రైం: కాకినాడ మండలంలోని గుడారిగుంట ప్రాంతాన్ని సారా రహిత ప్రాంతంగా ప్రకటిస్తున్నట్టు కాకినాడ నార్త్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.రామ్మోహన్‌రావు తెలిపారు. మంగళవారం గుడారిగుంట సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ మేరకు ప్రకటన చేశారు. నవోదయం 2.0కు విస్తృత ప్రచారం కల్పించి ప్రజలను సారాకి దూరం చేస్తున్నామని తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో గుడారిగుంటలో సారా నిర్మూలించినట్టు ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వ్యక్తి మృతి చెందినట్లు కోరంగి ఏఎస్సై ఏ.సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. యానాం సావిత్రినగర్ గ్రామానికి చెందిన చింతా శ్రీను(37) కాకినాడ పోర్టులో పనిచేస్తున్నాడు. సావిత్రినగర్ నుంచి కాకినాడకు ద్విచక్ర వాహనంపై బయలుదేరి గ్యాస్ సిలిండర్ తీసుకెళుతుండగా మట్లపాలెం పీచు ఫ్యాక్టరీ సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన శ్రీనును స్థానికులు 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబానికి జీవనాధారమైన వ్యక్తి అర్ధాంతరంగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు, గ్రామస్తులు కోరంగి పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చి ఆందోళన చేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు కారు యజమాని ముందుకు రావడంతో పరిస్థితి చక్కబడింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

మానవ అక్రమ రవాణాపై స్పెషల్ డ్రైవ్

గోకవరం: ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మంగళవారం చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మహిళలకు ప్రయాణ సమయంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. హెల్ప్ లైన్ నంబర్లు 139, 1098, 100 ఉపయోగం, ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం సుచరిత మార్గరేట్, చైల్డ్ రైట్స్ ప్రతినిధి కరిబండి రాజు పాల్గొన్నారు.

ఆస్తి పన్నుల్లో పేరు మార్పు ఇక సులభం

బోట్‌క్లబ్: నగరపాలక సంస్థ పరిధిలోని ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు, ఆస్తి పన్ను పేరు మార్పునకు ఆటో మ్యూటేషన్ విధానం సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ విషయాన్ని కమిషనర్ భావన మంగళవారం విలేకరులకు తెలిపారు. ఆస్తుల రిజిస్ట్రేషన్ సమయంలో, ఆస్తి యజమానిపై పన్ను పేరు మార్పులకు జరుగుతున్న ఇబ్బందులు, జాప్యం తొలగించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ క్రమంలో ఇప్పటికే విజయవాడలో ప్రతిష్టాత్మకంగా ఆటో మ్యూటేషన్ విధానం అమలు చేస్తుండగా, వచ్చిన ఫలితాలతో మొదటిగా రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్‌లలో ఈ విధానం ఆగస్టు ఒకటో తేదీ నుంచి అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు. దీంతో ఇకపై ఆస్తులు కొనుగోలు, అమ్మకాలు జరిగినపుడు పన్ను పేరుమార్పుకు కార్పొరేషన్‌కు రావాల్సిన అవసరం లేదన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలోనే ఆస్తి, ఖాళీ స్థలాలపై ఉన్న పాత బకాయి చెల్లించి, పన్ను పేరుమార్పునకు సంబంధించి మ్యూటేషన్ చార్జీలు చెల్లించిన వెంటనే పన్ను పేరుమార్పు పత్రాలను ఎటువంటి కాలయాపన లేకుండా పొందవచ్చువచ్చునన్నారు. నూతనంగా ప్రవేశపెట్టిన ఈ సేవలను నగర ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు.

క్రీడాకారులకు మెరుగైన సదుపాయాలు

సామర్లకోట: జూనియర్ హాకీ పోటీలకు హాజరవుతున్న క్రీడాకారులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టరు రాహుల్ మీనా అన్నారు. మంగళవారం సాయంత్రం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే క్రీడాకారులు విశ్రాంతి తీసుకోవడానికి ఏర్పాటు చేసిన రూములను ఆయన పరిశీలించారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి 12వ తేదీ వరకు కాకినాడలో జరుగనున్న జూనియర్ జాతీయ హాకీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 200 మందికి సామర్లకోటలో రూములను కేటాయించారు. వివిధ రాష్ట్రాల నుంచి రైల్వే స్టేషన్‌కు వచ్చిన క్రీడాకారులను కేటాయించిన విశ్రాంతి భవనాలకు రెవెన్యూ అధికారులు తీసుకు రావలసి ఉంటుందని జేసీ చెప్పారు. ఈ మేరకు టీటీడీసీలో 80 మంది విశ్రాంతి తీసుకునే విధంగా ఏర్పాటు చేసిన బెడ్‌లు, బెడ్ సీట్లు, తలగడలు లేకపోవడంతో వెంటనే వాటిని ఏర్పాటు చేయాలని ఆర్డీఓ ఎస్.మల్లిబాబుకు సూచించారు. రెవెన్యూ అకాడమిలో 80 మందికి కేటాయించగా కొన్ని రూములలోని బాత్ రూములకు డోర్లు లేకపోవడం, లైట్లు వెలగకపోవడాన్ని జేసీ గమనించి వాటిని సరి చేయాలన్నారు. అదే విధంగా విస్తరణ శిక్షణ కేంద్రంలో కేటాయించిన 40 బెడ్‌లపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. టీటీడీసీలో ఎక్కువగా మొక్కలు తుప్పలు ఉండటం వలన పాములు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు బాలురు, బాలికలకు కేటాయించిన బాత్ రూములను జేసీ పరిశీలించారు. క్రీడాకారులు గదుల్లో ఉన్నంత సమయం అక్కడ రెవెన్యూ సిబ్బంది ఉండాలన్నారు. కీడాకారులకు కేటాయించిన రూముల్లో కావలసిన సదుపాయాలు కల్పించడానికి నిధులు విడుదల చేశారన్నారు. స్థానిక టీటీడీసీలోని మెస్ నుంచి కాలసిన వారికి అల్పాహారం ఏర్పాటు చేస్తామని ఆర్డీఓ మల్లిబాబు తెలిపారు. ముందుగా వచ్చిన క్రీడాకారులకు కాకినాడ నుంచి భోజనాలు ఏర్పాటు చేసినట్టు ఆర్డీఓ చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీనివాసు, వీఆర్వోలు రాంజీ, లోవరాజు, ఆదినారాయణ, జానీ, రాజేష్, వెంకటలక్ష్మి, బాబీ పాల్గొన్నారు.



రెవెన్యూ అకాడమీ వద్ద ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇస్తున్న జేసీ

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు



కరపలో ట్రాక్టర్ ఢీకొట్టిన వృద్ధుడిని పక్కకు తీసుకొస్తున్న స్థానికులు



కరప మార్కెట్ సెంటర్‌లో రోడ్డుపై నిలిపిన ఆటోను తప్పిస్తున్న ట్రాక్టర్

కరప: స్థానిక మార్కెట్ సెంటర్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కరప గ్రామానికి చెందిన వృద్ధుడు శ్రీరాములు మార్కెట్ సెంటర్ వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా రామచంద్రపురం వైపు నుంచి వస్తున్న ఇటుకల లోడ్ ట్రాక్టర్ అక్కడ రోడ్డుకు అడ్డుగా ఆటో నిలిపి ఉంచడంతో దానిని తప్పించే ప్రయత్నంలో వృద్ధుడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వృద్ధుడి కాలుకి, ఇతర చోట్ల తీవ్ర గాయాలయ్యాయి. అతనిని చికిత్స కోసం స్థానికులు స్పందించి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు రాలేదని కరప పోలీసులు తెలిపారు. కరప మార్కెట్ సెంటర్‌లో రోడ్డుకు అడ్డుగా ఆటోలు నిలుపడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, మార్కెట్ సెంటర్‌లో ప్రమాదాలు నివారించేందుకు ఆటోలు ఆసెంటర్‌లో నిలుపకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రత్తిపాడు: మండలంలోని ఒమ్మంగి గ్రామంలోని పేకాట శిబిరంపై మంగళవారం రాత్రి ప్రత్తిపాడు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు జూదరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.10,760 నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

గుక్కెడు నీటి కోసం పాట్లు

- ఎన్‌టీఆర్ కాలనీలో నాలుగు రోజులుగా అందని తాగునీరు
- పట్టించుకోని అధికారులు

పెద్దాపురం: గుక్కెడు నీళ్ల కోసం ఆ పట్టణ ప్రజల ఎదురుచూస్తున్నారు. చుక్క నీరు కోసం నాలుగు రోజులుగా అల్లాడిపోతున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధి ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు తప్ప తాగునీరు మాత్రం అందించడంలేదని వారు వాపోతున్నారు. ఇది ఎక్కడో కాదండీ జిల్లా నడిబొడ్డు పెద్దాపురం పట్టణంలో ఎన్‌టీఆర్ కాలనీ ప్రజల అవస్థలు. పట్టణంలో పైపులైన్లు మరమ్మతులు, ట్యాంక్ లీకుల పేరుతో గత నాలుగు రోజులుగా పెద్దాపురం పట్టణంలో ఎన్‌టీఆర్ కాలనీ ప్రజలకు చుక్క నీరందక ఇక్కట్లు పడుతున్నారు.



మంచినీటి కోసం కిలోమీటర్ దూరం నుంచి తెచ్చుకుంటున్న కాలనీవాసులు

స్థానిక జగ్గంపేట రహదారిలోని ఎన్‌టీఆర్ కాలనీల్లో సమస్యలు విలయ తాండవం చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వస్తే మా కాలనీకి అన్ని వసతులు వచ్చేస్తాయనుకున్న కాలనీ వాసులకు ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి కావస్తున్నా ఏ ఒక్క సమస్య పరిష్కరమైన దాఖలాల్లేవు. ఎక్కడా చూసినా అపారిశుధ్యం, మంచినీటి పైపులైన్ల లీకులు, అపార్ట్‌మెంట్లు శిథిలం వంటి భయాందోళన మధ్య కాలనీవాసులు జీవనం సాగిస్తున్నారు. కాలనీలో కనీస వసతులు కల్పించాల్సిన మున్సిపల్ యంత్రాంగం పారిశుధ్య నిర్వహణ, పైపులైన్ల మరమ్మతులపై దృష్టి సారించిన దాఖలాల్లేవు. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పూర్తి స్థాయిలో మంచినీటి వసతి, పరిశుభ్రమైన వాతావరణం, రాత్రి అయితే కటిక చీకటిలో జీవనం సాగించాల్సి వస్తుందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం నీటి వృథా

కాలనీలోని ఆపార్ట్‌మెంట్‌లలో ఎక్కడికక్కడే వాటర్ ట్యాంకులు లీకు కావడంతో నీరు వృథా అవుతోంది. ఉదయం ఏడు గంటలకు మున్సిపల్ వాటర్ పంపిణీ చేసేటప్పటికి ప్రతీ అపార్ట్‌మెంట్‌లో ఏదో బ్లాక్ నుంచి పైపులైన్లు పగలడంతో మంచినీరు మురుగు కాలువల్లోకి చేరుతుంది తప్ప ప్రజలకు ఉపయోగకరంగా లేకపోవడంతో అక్కడి వాసులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధింత ఇంజినీరింగ్ అధికారులు మంచినీటి పైపులైన్ల లీకులపై దృష్టి సారించాల్సి ఉన్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో కాలనీ వాసులు నానా అవస్థలు పడుతున్నారు. గత నాలుగు రోజులుగా కాలనీకి రావాల్సిన మంచినీటి సరఫరా పూర్తిగా కకపోవడంతో కాలనీ వాసులు నాలుగు రోజుల నుంచి గుక్కెడు నీటికి కరువయ్యారు.



పెద్దాపురం ఎన్‌టీఆర్ కాలనీ ముఖద్వారం



కాలనీలో పైపులైన్ లీకై వృథాగా పోతున్న మంచినీరు

కాలనీలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



ఎన్‌టీఆర్ కాలనీలో ఇక్కడి వారందరం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కనీస వసతులు, పారిశుధ్యం, మంచినీటి సరఫరా సక్రమంగా లేక నానా అవస్థలు పడుతున్నా పట్టించుకునే నాథుడు లేడు. అపార్ట్‌మెంట్‌లో చాలా వరకు అసలు ఓనర్లు లేకపోవడంతో అద్దెకు ఉండే వాళ్లు ప్లాట్లను శుభ్రంగా ఉంచడం లేదు. దీంతో అధికారులు కూడా కాలనీ వైపు కన్నెత్తి చూసే పరిస్థితి లేకపోవడంతో ఇక్కడ ప్రజలకు సమస్యలు ఎక్కువయ్యాయి.

– అక్షింతల గంగాధర్, స్థానికుడు

పలుమార్లు కౌన్సిల్‌లో చర్చించా..



కాలనీ సమస్యలపై ప్రతి నెలా కౌన్సిల్ సమావేశంలో చర్చించా. రెండు రోజులు నీటి సరఫరా ఇస్తారు. తరువాత నుంచి మళ్లీ కాలనీ వాసులు ఇబ్బందులు అధికారులు పట్టించుకోవడం లేదు. కాలనీలో వీధి కుళాయిలు వేయించి పైపులైన్లు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించి పూర్తి స్థాయిలో మంచినీటి సరఫరా చేపట్టాలి.

– కడియాల కనకదుర్గ, 28వ వార్డు కౌన్సిలర్

సమస్యల పరిష్కారానికి చర్యలు



ఎన్‌టిఆర్ కాలనీ వసుల ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతాం. త్వరలోనే నీటి సరఫరాను పునరుద్ధరించి మంచినీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూస్తాం. నిత్యం పారిశుధ్య పనులు చేయించి, పైపులైన్ల లీకులు, అక్కడి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతాం.

– శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, పెద్దాపురం

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

ప్రత్తిపాడు: మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 11 మందిపై కేసులు నమోదు చేసినట్టు సీఐ బి.సూర్య అప్పారావు తెలిపారు. నిందితులను మంగళవారం స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఇద్దరు నిందితులకు జైలు శిక్ష, తొమ్మిది మందికి రూ.90 వేలు జరిమానా విధించారు. అన్నవరం, ఏలేశ్వరం, ప్రత్తిపాడు స్టేషన్ల పరిధిలో అరెస్టు చేసిన తొమ్మిది మందికి న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.90 వేలు జరిమానా విధించారన్నారు.

వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు

జగ్గంపేట: బలవంతం, అక్రమ నిర్బంద వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై టి.రఘునాథరావు తెలిపారు. జగ్గంపేటకు చెందిన ఈశ్వరరావు రాజమండ్రి వెళ్లే రోడ్డులో షాపు నిర్మించుకుంటుండగా అదే గ్రామానికి చెందిన ఆకుల సోమశేఖర్ విలేకరునని చెప్పి ఇబ్బందులకు గురిచేసినట్టు పేర్కొన్నారు. అతడిని రూ.50 వేలు ఇవ్వాలని బ్లాక్‌మెయిల్ చేయడంతో రూ.10 వేలు ఇచ్చారు. ఇంకా ఇవ్వాలని ఇబ్బంది పెట్టడంతో ఈశ్వరరావు ఫిర్యాదు మేరకు సోమశేఖర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశామన్నారు.

సారా స్థావరాలపై దాడులు

ప్రత్తిపాడు: మండలంలోని వెంకటనగరం పంచాయతీ శివారు తోటపల్లి గిరిజన తండాలోని సారా స్థావరాలపై ప్రత్తిపాడు ఎక్సైజ్ సిబ్బంది మంగళవారం దాడులు చేశారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 1,000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారైన తోటపల్లికి చెందిన నాగరాజుపై కేసు నమోదు చేశారు. దాడుల్లో స్థానిక ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.